క్లుప్తంగా

కాలేజీకి చాకలి ఐలమ్మ పేరు గొప్ప నిర్ణయం

రజక సంఘం జిల్లా జేఏసీ అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య

షాబాద్: హైదరాబాద్‌లోని కోటి ఉమెన్స్ కళాశాలకు ప్రభుత్వం చాకలి ఐలమ్మ పేరు పెట్టడం చరిత్రాత్మక నిర్ణయమని రజక సంఘం జిల్లా జేఏసీ అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భూమి, భుక్తి కోసం సాయుధ పోరాటం చేసిన చాకలి ఐలమ్మ వర్ధంతి రోజు కళాశాలకు ఆమె పేరును పెడతామని సీఎం ప్రకటించడంతో రజక సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రజకులకు గుర్తింపునిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

హైటెన్షన్ విద్యుత్ లైన్‌తో ఇబ్బంది

కేశంపేట: ఇళ్ల సమీపంలో నుంచి హైటెన్షన్ విద్యుత్ వైర్లు (765 కేవీ) వెళ్తున్నాయని, వాటిని గ్రామానికి దూరం నుంచి తీసుకెళ్లాలని కోరుతూ మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామస్తులు గురువారం తహసీల్దార్ అజీంఅలీకి వినతిపత్రం అందించారు. మహేశ్వరం నుంచి జడ్చర్ల వరకు నిర్మిస్తున్న హైటెన్షన్ విద్యుత్‌లైన్ గ్రామంలోని ఇళ్లకు సమీపంలో నుంచి వెళ్లడంతో భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని గ్రామ ప్రజలు పేర్కొన్నారు. ఈ విద్యుత్ లైన్ మొదట ఇచ్చిన మార్కింగ్ విధంగానే నిర్మించాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణయ్య, మాజీ ఉపసర్పంచ్ రమేశ్, పూజారి రవిశర్మ, భూపాల్‌రెడ్డి, ముత్యాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, మహేశ్, నర్సింలు, మస్తాన్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభస్వామి ఆలయంలో న్యాయమూర్తి పూజలు



న్యాయమూర్తికి ఆలయ చరిత్రను వివరిస్తున్న చైర్మన్ అనితారెడ్డి

కొత్తూరు: హైకోర్టు న్యాయమూర్తి సుధ గురువారం మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో ఉన్న అనంతపద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు న్యాయమూర్తికి ఆలయ చరిత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బెజవాడ అనితారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి, సీఏ నర్సింహరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఐ రోజా ఫరూఖ్‌నగర్‌కు బదిలీ

నందిగామ: మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా పనిచేస్తున్న రోజా గురువారం బదిలీ అయ్యారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. సుమారు 2 ఏళ్లకుపైగా నందిగామ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా విధులు నిర్వహించారు. ఆమె ఫరూఖ్‌నగర్‌కు బదిలీ కాగా గతంలో ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం నుంచి వచ్చి డిప్యూటేషన్‌పై నందిగామ తహసీల్దారు కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్‌ఐ శ్రీనివాస్‌గౌడ్‌కు రెగ్యులర్ పోస్టుగా నందిగామ ఆర్‌ఐగా నియమించారు.

రియల్ వ్యాపారులపై చర్యలకు ఫిర్యాదు

చేవెళ్ల: మండలంలోని దుద్దాగు గ్రామంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు బెదిరింపులకు పాల్పడుతున్న రియల్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కన్వీనర్ అల్లి దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో డీటీ రాజశేఖర్‌కు గ్రామస్తులతో కలిసి గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని దుద్దాగు గ్రామంలో సర్వే నెంబర్ 52లో దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో పేదలకు ఇళ్లపట్టాలు అందించారని చెప్పారు. అప్పటి నుంచి నేటివరకు పేదలు ఆ స్థలాల్లో ఉన్నారని చెప్పారు. అయితే కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బ్రోకర్లు ఈ భూములపై కన్నేసి పేదలను ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను ప్రభుత్వ ఆధీనంలో ఉండేలా చూడాలని పేదలను బెదిరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉన్నారు.

వాహనాలు తగిలి పీహెచ్‌సీ ప్రహరీ ధ్వంసం

కొందుర్గు: మట్టి తరలించే టిప్పర్ వాహనం తగిలి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ కూలిపడింది. దీంతో ఆస్పత్రిలోకి కుక్కలు, పందులు వెళ్లే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. గోడ కూలడానికి బాధ్యులైన వారిపై చర్య తీసుకొని ప్రహరీని తిరిగి నిర్మించాలని కోరుతున్నారు.

నష్టాన్ని మిగిల్చిన వర్షం

ఎడతెరిపిలేని వానలకు దెబ్బతిన్న పంటలు

- వాడిపోయి నేలకొరిగిన పత్తి, కూరగాయల మొక్కలు
- ఆందోళనలో రైతన్నలు
- కొద్దిపాటు చర్యలు తీసుకుంటే కాపాడుకోవచ్చంటున్న అధికారులు



ఉత్తరాసిపల్లిలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను చూస్తున్న రైతన్నలు

కొందుర్గు: వారంరోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా పత్తి, కూరగాయల పంటలు కోలుకోలేని పరిస్థితికి చేరాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి అప్పులు చేసి పంటలు సాగుచేస్తే అధిక వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయని వాపోతున్నారు.

మండలంలో పంటల సాగు

ఈ ఏడాది వర్షాకాలం సీజన్‌లో మండలంలో 4 వేల ఎకరాల్లో పత్తి, 2500ల ఎకరాల్లో మొక్కజొన్న, 7వేల ఎకరాల్లో వరితోపాటు 500ల ఎకరాల్లో కూరగాయల పంటలు సాగుచేశారు. అయితే ఇటీవల కురిసిన బారి వర్షాలకు పత్తిపంట దాదాపు 50 శాతం దెబ్బతిన్నట్లు రైతన్నలు పేర్కొంటున్నారు. ఇక జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 2800 ఎకరాల విస్తీర్ణంలో పత్తి, 3 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 7 వేల ఎకరాల్లో వరి 120 ఎకరాల్లో కూరగాయ పంటలు సాగుచేశారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు 100 ఎకరాల విస్తీర్ణంలో పత్తిపంట దెబ్బతిన్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

అధికారుల సూచనలు

అధిక వర్షాల నుంచి పంటలు దెబ్బతిన్నది వాస్తవమేనని కొద్దిపాటు చర్యలు తీసుకుంటే కొంతవరకు పంటలను కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజారత్నం మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గిన అనంతరం పంట పొలంలో నిలిచిన వర్షపునీటిని తీసివేయాలన్నారు. ఎకరాకు 25 కిలోల యూరియా 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను పంటకు పైపాటుగా వాడాలని సూచించారు. ముంపునకు గురైన పంట త్వరగా కోలుకోవాలంటే 19:19:19 లేదా 13-0-45 మందును లీటరు నీటికి 10 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు.



శ్రీరంగాపూర్‌లో దెబ్బతిన్న పంటను చూపుతున్న రైతు

పత్తిపంట దెబ్బతిన్నది

ఈ ఏడాది పది ఎకరాల్లో పత్తిపంటను సాగుచేశాను. పెట్టుబడుల కోసం ఇప్పటివరకు దాదాపు రూ.1.50 లక్షలు ఖర్చుచేశాను. పంట ఏపుగా పెరిగింది. ఇదే సమయంలో ఎడతెరిపిలేని వర్షాలకు పత్తిపంట అంతా నేలకు వాలిపోయింది. ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.



– రామయ్య, బైరంపల్లి

చేతికందే సమయంలో..

మరో నెలరోజులైతే పత్తిపంట చేతికందేది. భారీ వర్షాల కారణంగా నేలపాలైంది. ఈ పంట కోలుకుంటుందో లేదో తెలియని దుస్థితి. పంట బాగుంటే 50 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ప్రస్తుతం పెట్టుబడులు కూడా రావు.



– గోపాల్ రెడ్డి, చుక్కమెట్టు

విద్యార్థులు మత్తుకు బానిస కావొద్దు

షీటీం ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి

షాద్‌నగర్: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలుగా మారి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని షీటీం ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి సూచించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవడం ద్వారా ఉత్తమ పౌరులుగా తయారవుతారన్నారు. అదేవిధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పే విషయాలను విద్యార్థులు శ్రద్ధగా వినాలని సూచించారు. మద్యం, మత్తు పదార్థాలకు అలవాటు పడితే అనారోగ్యం బారిన పడతారని, జీవితం నాశనం అవుతుందన్నారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌లకు పాల్పడొద్దని, సామాజిక మాధ్యమాల్లో వేధింపులకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా చాలామంది యువత డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడుతున్నారని, వీటితో ప్రాణాలకు ఎంతో ప్రమాదమన్నారు. ఎవరైనా డ్రగ్స్, గంజాయి వంటి వాటిని విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రతీ విద్యార్థి ఉత్తమ పౌరుడిగా ఎదిగి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ



మాట్లాడుతున్న కృష్ణ

షాబాద్: చట్ట సభలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జడల రాజేందర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని గౌడ సంఘ భవన్‌లో బీసీ ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. పార్టీలకతీతంగా బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి తమ హక్కుల సాధనకు ఉద్యమించాలని సూచించారు. షాబాద్‌లో త్వరలో బీసీ ఐక్యవేదిక భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో బీసీలను చైతన్యం చేసేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తమ్మలి రవీందర్, ప్రజాచైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోల్ నర్సింలుగౌడ్, సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య, మాజీ ఎంపీపీ కూర వెంకటయ్య, బీసీ సంఘం నాయకులు రమేశ్‌యాదవ్, కుమ్మరి దర్శన్, చేవెళ్ల స్వామి, మాసయ్య, సత్యనారాయణ, జంగయ్య, ఒగ్గు రాజు, రామకృష్ణ, నర్సింలు, శ్రీనివాస్, విఠలయ్య, గోపాల్, భిక్షపతి తదితరులు ఉన్నారు.

కేంద్ర మంత్రికి సన్మానం



కేంద్ర మంత్రి చంద్రశేఖర్‌రాజును సన్మానిస్తున్న ఎంపీ, నాయకులు

మొయినాబాద్‌రూరల్: కేంద్ర మంత్రి చంద్రశేఖర్ రాజును బీజేపీ మండల నాయకులు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి ఘనంగా సన్మానించారు. గురువారం కేంద్ర మంత్రి హైదరాబాద్‌కు విచ్చేయడంతో ఆయనకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎంపీ ఆధ్వర్యంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌తో పాటు నాయకులు కలిసి శాలువా, పూలమాలతో ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వాముల అశోక్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, క్రాంతికిరణ్, కృష్ణ, నవీన్, గాలయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



కొందుర్గు: మాట్లాడుతున్న తహసీల్దార్ జగదీశ్వర్

కొందుర్గు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ జగదీశ్వర్ సూచించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం చౌదరిగూడ మండల కేంద్రంలో క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడలతో శారీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. ప్రభుత్వం విద్యార్థులను ప్రోత్సహించడానికే ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సునిత, వ్యాయామ ఉపాధ్యాయులు శిరీష, రమేశ్, నరేందర్, రజనీ, ప్రవీణ్‌కుమార్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించాలి

నందిగామ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ సూచించారు. మండల కేంద్రమైన నందిగామలోని ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలలకు చెందిన క్రీడాకారులు హాజరుకాగా అందులో నైపుణ్యం ప్రదర్శించిన వారిని మండలస్థాయి క్రీడలకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్లు సిద్ధార్థ, గోపాల్‌సింగ్, సల్మాన్‌రాజ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నచ్చిన క్రీడల్లో సత్తాచాటాలి

సీనియర్ సివిల్ కోర్టు జడ్జి దశరథరామయ్య



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జడ్జీ దశరథరామయ్య తదితరులు

చేవెళ్ల: యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు టోర్నమెంట్‌లు దోహదపడతాయని చేవెళ్ల సీనియర్ సివిల్ కోర్టు జడ్జి దశరథరామయ్య, జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కిరణ్‌కుమార్‌లు అన్నారు. మండల కేంద్రంలోని స్టేడియంలో గురువారం చేవెళ్ల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఒకరోజు వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు జడ్జీల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జడ్జీలు మాట్లాడుతూ.. సమాజంలో డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలతో యువత జీవితాలు నాశనం చేసుకోకుండా నచ్చిన క్రీడల్లో రాణించాలని సూచించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్‌లు నిర్వహించటం అభినందనీయమన్నారు. యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు టోర్నమెంట్‌లు ఉపయోగపడుతాయన్నారు. చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ మాట్లాడుతూ.. మొత్తం 14 టీమ్‌లు ఈ పోటీలో పాల్గొన్నాయని చెప్పారు. ఈ టోర్నమెంట్‌లో పోలీస్ సైబరాబాద్ టీమ్ విజేతగా నిలువగా దేవునిఎర్రవల్లి టీమ్ రన్నరప్‌గా నిలిచింది. ఆలూరు టీమ్ తృతీయ స్థానంలో అంతారం టీమ్‌లు సెమీఫైనల్ వరకు వచ్చినట్లు తెలిపారు. గెలుపోటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్ సీఐ రమేశ్‌నాయుడు, ఎస్‌ఐలు శ్రీకాంత్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, కామెంటరీలుగా ఉపాధ్యాయులు పరమేశ్వర్, నరేందర్‌రెడ్డిలు, పోటీల న్యాయ నిర్ణేతలుగా శ్రీనాథ్, కిరణ్‌లు పోలీస్ సిబ్బంది, మండల యువకులు పాల్గొన్నారు.

రోడ్డుపై బీఆర్‌ఎస్ నేతల బైఠాయింపు



నిరసన తెలుపుతున్న నాయకులు

కొందుర్గు: అక్రమ అరెస్టులు, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి నిరసనగా మండల కేంద్రంలో గురువారం రాత్రి బీఆర్‌ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిచేసిన నేపథ్యంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులను, మాజీ మంత్రి హరీశ్‌రావును పోలీసులు అరెస్టు చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వమా లేదా నిరంకుశ పాలననా అని నిలదీశారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్‌పటేల్, రామకృష్ణ, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్‌రూరల్: పోషకాహార పదార్థాల స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, సీడీపీఓ తదితరులు

షాద్‌నగర్‌రూరల్: పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో సీడీపీఓ నాగమణి ఆధ్వర్యంలో పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై పోషకాహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు మనం తీసుకునే ఆహారంపై మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. సమాజంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశకార్యకర్తలు చేస్తున్న సేవలు మరువలేనివని, వారి సంక్షేమానికి ప్రభుత్వం తప్పనిసరిగా చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి పద్మజరమణ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ విద్యలో ప్రభుత్వం మార్పులను తీసుకొచ్చిందన్నారు. పోషకలోపం ఉన్న చిన్నారులకు, కిశోర బాలికలకు, గర్భిణులకు ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా పోషకాహారాన్ని అందిస్తుందన్నారు. అనంతరం ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సంధ్యారాణి, దివ్య, వెంకటమ్మ, అండాలు, జయలక్ష్మి, జోత్స్న, మీన, రేణుక, లక్ష్మీబాయి, శమంత, నాయకులు బాబర్‌అలీఖాన్, రఘు, విశ్వం, ఇబ్రహీం, బాల్‌రాజ్‌గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, బస్వం, పురుషోత్తంరెడ్డి, పోషణ అభియాన్ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

షాద్‌నగర్: పట్టణంలోని పలు కాలనీల్లో నూతనంగా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఫరూఖ్‌నగర్‌లోని ఖిల్లాలో రూ.15లక్షలతో సీసీరోడ్డు, న్యూ రాఘవేంద్రకాలనీలో రూ.10లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పట్టణంలోని పాలశీతల కేంద్రంలో మంచినీటి సమస్య ఉందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తన సొంత నిధులతో బోరు వేయించారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, జమృద్‌ఖాన్, శ్రావణి, విజయేందర్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, సందీప్‌గౌడ్, కైసర్, అమీర్‌జానీ, బుచ్చిబాబు, కొమ్ము కృష్ణ, అశోక్, గంతల ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘనంగా సన్మానం

ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ గౌడ సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, రాములుగౌడ్, రవి, శేఖర్‌గౌడ్, మల్లేశ్, రాజుగౌడ్, మారుతి, కోటి లింగం, రామస్వామి, వెంకటేశ్‌గౌడ్, విఠల్‌గౌడ్, జగన్‌గౌడ్, జనార్ధన్, వెంకటయ్య, అర్జున్‌కుమార్, రాము పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

సీఐ కాంతారెడ్డి

షాబాద్: వినాయక నిమజ్జన సమయంలో డీజేలకు అనుమతి లేదని సీఐ కాంతారెడ్డి పేర్కొన్నారు. గురువారం షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మండలానికి చెందిన డీజే నిర్వాహకులు, ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక నిమజ్జన సందర్భంగా డీజేలు పెట్టడానికి ఎలాంటి అనుమతులు లేవని, ఒకవేళ ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా డీజే పెట్టినట్లయితే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు నవీన్‌రెడ్డి, సతీశ్, సిబ్బంది ఉన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు



వాగు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ, మండలంలోని వినాయకుల నిమజ్జనానికి కావాల్సిన ఏర్పాట్లను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ డీఈ రమేశ్, సీఐ హబీబుల్లాఖాన్ పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్ మూసీవాగు వద్ద వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. వాగు వద్ద లైట్లు, భారీ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు క్రేన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులందరూ అధికారులకు సహకరించాలని, ఎక్కడైనా గొడవలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాములు, నాయకులు ఉన్నారు.

వైభవంగా గణనాథుడి పూజలు



షాద్‌నగర్‌లో పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో గణేశ్ నవరాత్రులను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజు గురువారం ఆయా మండపాల్లో గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పించి జయములివ్వు బొజ్జగణేశా అంటూ వేడుకున్నారు. పలు మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఆయా గ్రామాల్లోని పలు వినాయకులను నిమజ్జనానికి తరలిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని దక్కించుకున్నారు. అనంతరం గణనాథులను నృత్యాలు, ఆటాపాటలతో నిమజ్జనానికి తీసుకెళ్లారు.



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో పూజలో పాల్గొన్న భక్తులు



షాద్‌నగర్: లింగారెడ్డిగూడలో వినాయకుడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను దాతలు ప్రోత్సహించడం అభినందనీయమని చిలుకూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భీమయ్య అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన జీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గరుగు రాజు ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు అందజేశారు.కార్యక్రమంలో నాయకులు జకరయ్య, రాజశేఖర్, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.